శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# సామాజిక భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**- ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**





**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల నిర్వహిస్తున్న ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్ పథకం కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. మార్చి నెలకు సంబంధించి గూడూరు పురపాలక సంఘ పరిధిలోని మాళవ్యా నగర్3 సచివాలయ పరిధిలో నాయుడు కాలువ కట్ట ప్రాంతంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండూరు సోమశేఖర్‌కు బెడ్ రిడెన్ పింఛన్ రూ. 15,000, అల్లూరు శేషమ్మకు వితంతు పింఛన్ రూ. 4,000, జి. శెల్వికు వితంతు పింఛన్ రూ. 4,000లను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని, పింఛన్ లబ్ధిదారులు ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పురపాలక సంఘ కమీషనర్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, పురపాలక సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రానికి 271 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 65.468టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 200, ఎస్‌ఎఫ్‌సికి 700, పెన్నా డెల్టా 1000 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.842 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# నెల్లూరులో సంక్షేమ పండుగ గడప వద్దకే పెన్షన్

**: మంత్రి నారాయణ**

**- అవ్వాతాతల ముఖాల్లో ఆనందం.. ఒక రోజు ముందే అందిన ఫించన్ కానుక**

**- నెల్లూరు సిటీలో 9 కోట్ల పెన్షన్ల పంపిణీ**

**- వెంకటేశ్వరపురంలో 28వ ఎన్టీఆర్ సుజల ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి నారాయణ**



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో శనివారం సంక్షేమ పండుగ నెలకొంది. మంత్రి నారాయణ స్వయంగా ఇంటింటికి వెళ్లి అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఒక రోజు ముందే పెన్షన్లను అందజేసి వారి ముఖాల్లో ఆనందం నింపారు. తమ గడప వద్దకే వచ్చి పెన్షన్ అందించిన మంత్రికి లబ్ధిదారులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వరపురంలో ప్రజల తాగునీటి కష్టాలను తీరుస్తూ 28వ ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ప్రతి నెల ఒకటో తేదీ ఒక పండుగ లాంటిదని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం రూ.4వేలు పెన్షన్ అందిస్తున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు. గత ప్రభుత్వం నెలకు రూ1,300 కోట్లు పెన్షన్లకు వెచ్చిస్తే, మా ప్రభుత్వం ఏకంగా 2700 కోట్లు ఖర్చు చేస్తూ, 18 నెలల్లోనే 53,000 కోట్లు లబ్ధిదారులకు అందజేసిందని ఆయన వెల్లడించారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముందు రోజే పంపిణీ చేపట్టామని, నెల్లూరు సిటీలో 20,588 మందికి 9 కోట్లకు పైగా పెన్షన్ ఇస్తున్నామని తెలిపారు. కేవలం సంక్షేమమే కాకుండా, 50 కోట్లతో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, నెల్లూరును దోమలు లేని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతామని, ఎన్టీఆర్ సుజల ద్వారా 2 రూపాలయకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందిస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు.

**ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర మాట్లాడుతూ** రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పండుగ జరుగుతోంది. ఒక రోజు ముందుగానే పెన్షన్ అందడంతో వృద్ధులు, వికలాంగుల ఆనందానికి అవధులు లేవన్నారు. అడగగానే స్పందించే గొప్ప నాయకుడు మంత్రి నారాయణ అని, ఆయన సిటీ ఎమ్మెల్యే కావడం నియోజకవర్గ ప్రజల అదృష్టం అని తెలిపారు. స్కూల్స్, పార్కుల అభివృద్ధి, కాలువల పూడిక తీత పనులకు ఆయన పెద్ద పీట వేస్తున్నారన్నారు. కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా విజన్‌తో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారనితెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, డివిజన్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల కళ్ళలో ఆనందం నింపుతున్న ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్

**- రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి 'ఆనం'**



**అనుమసముద్రంపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ప్రతినెలా క్రమం తప్పకుండా కోట్లాది రూపాయలతో పంపిణీ చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పేదల కళ్ళలో ఆనందాన్ని నింపుతున్నాయని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామానారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏఎస్‌పేట మండలంలోని వేల్పుల గుంట గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి లబ్ధిదారుల ఇళ్ళవద్దకు వెళ్ళి పంపిణీ చేశారు. 1వ తేదీ ఆదివారం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కరోజు ముందుగా నే పెన్షన్లు పంపిణీ ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో 62,76లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెలా 2,725 కోట్లను ఇంటివద్దకే అందిస్తున్నామని, నెల్లూరు జిల్లాలో 2,89,674 మందికి సుమారు 127కోట్ల రూపాయల పెన్షన్ పంపిణీ చేస్తున్నామన్నారు. 11లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించడంతోపాటు 2లక్షల రూపాయలతో కొత్త రోడ్లకు శంఖుస్థాపన చేశారు. 31.60లక్షల జెజెఎం నిధులతో రక్షిత మంచినీటి పథకానికి శంఖుస్థాపన చేశారు. మండలంలోని చివరిగ్రామమైన వేల్పులగుంటకు సోమశిల ఉత్తరకాలువ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అమలు చేసి వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

**రాష్ట్ర వ్యాప్తంగా 5వేలకు పైగా ఆలయాల నిర్మాణాలు**

వేల్పులగుంట ఎస్సీ కాలనీలో శ్రీవాణి నిధులతో నిర్మించనున్న శ్రీ వినాయకస్వామి దేవస్థానానికి భూమిపూజ చేశారు. 20లక్షలతో ఆలయ నిర్మాణం, 9లక్షలతో ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా తిరుమల , తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధులతో 5వేలకు పైగా ఆలయాలు నిర్మిస్తున్నా మన్నారు. ధూప, దీప నైవేద్యం పథకం ద్వారా ప్రతి ఆలయ అర్చకుడికి నెలకు 10వేల రూపాయలు చెల్లిస్తున్నా మన్నారు. వెయ్యికోట్ల రూపాయలతో ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.

**సూపర్‌సిక్స్ అమలు - పి4 కార్యక్రమం విజయవంతం**

ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని , అభివృద్ధి-సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని మంత్రి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ఆత్మకూరు మ్యాగజౌన్‌ను ఆవిష్కరించారు. పి'4 కార్యక్రమం ద్వారా బండారుపల్లి గ్రామానికి చెందిన బాలు కుటుంబాన్ని తన కుమార్తె లీలా కైవల్యారెడ్డి దత్తత తీసుకొని అండగా నిలిచిన విషయాన్ని మంత్రి వివరించారు. కృత్రిమ కాలు ఏర్పాటు చేయించి ఆ బాలుడి భవిష్యత్తుకు బాటలు వేశామన్నారు. ఈకార్యక్రమం ద్వారా అనేకమంది గిరిజనుల జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నాగరాజాకుమారి , ఆర్‌డిఒ బి.పావని, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు, రాజవోలు సొసైటీ అధ్యక్షుడు కాటంరెడ్డి నర్సింహారెడ్డి, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు ఏలూరి మాల్యాద్రి నాయుడు, టిడిపి మండల మైనార్టీ నాయకులు షేక్ జిలానీబాషా, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నెల్లూరు సిటీలో అభివృద్ధి జైత్రయాత్ర

**- రూ.2కోట్లతో నూతన పనులకు మంత్రి నారాయణ శ్రీకారం**

**- 60 ఏళ్ల నిరీక్షణకు తెర.. పొర్లుకట్టపై సీసీ రోడ్డు.. స్వతంత్ర పార్కు వద్ద ఆధునిక డ్రైన్ల పనులు ప్రారంభం**

**- మార్చిలోగా పెండింగ్ పనులు పూర్తి.. నెల్లూరును దోమలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం**

**- ముంపు ముప్పునకు చెక్.. 15 కాలువల ఆధునీకరణతో నెల్లూరు రూపురేఖలు మారుస్తాం**

**- అభివృద్ధిపై అసత్య ప్రచారాలు వద్దు.. ప్రజల సహకారంతో నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తా**



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను మంత్రి నారాయణ వరుసలు పెట్టిస్తున్నారు. ఇందులో భాగంగా గాంధీబొమ్మ సెంటర్ స్వతంత్ర పార్కు వద్ద 75 లక్షల రూపాయలతో మూడు డ్రైన్లు, కల్వర్టు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి.. ఈ పనులను మార్చి ఆఖరు కల్లా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే 48వ డివిజన్ పొర్లుకట్ట వాసుల 60 ఏళ్ల నాటి సమస్యను పరిష్కరిస్తూ, కోటి 25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానికులు మంత్రికి అడుగడుగునా నీరాజనాలు పలికారు. నెల్లూరును ముంపు ముప్పు నుండి తప్పించేందుకు 15 ప్రధాన కాలువల ఆధునీకరణ చేపడుతున్నామని, కాలువలపై కొత్త రోడ్లు నిర్మించి నెల్లూరును దోమలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి పనులపై కొందరు అసత్య ప్రచారాలతో రాజకీయం చేస్తున్నారని, ప్రజలు అలాంటి మాటలు నమ్మి ఆందోళన చెందవద్దని కోరారు. ప్రజల సహకారం ఉంటే నెల్లూరును దేశంలోనే అత్యుత్తమ స్మార్ట్ సిటీగా మారుస్తానని మంత్రి నారాయణ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్లు తహసీన్ ఇంతియాజ్, రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పటీసీ విజేతరెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ పెంచలయ్య,ఇన్‌చార్జి కీర్తి,కో క్లస్టర్ షేక్ జాఫర్, బూత్ కన్వీనర్లు, నౌషాద్, ఫయాజ్, బ్రహ్మయ్య, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరాయంగా సీఎం రిలీఫ్ ఫండ్ సాయం

**తాజాగా మరో 31 మందికి రూ.19 లక్షలు మంజూరు**



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరులోని వేదాయపాళెం కార్యాలయంలో శనివారం బాధితులకు చెక్కులు పంపిణీ చేసిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వేపల్లిలో ఇప్పటి వరకు రూ.6.47 కోట్లు సాయం అందుకున్న 703 మంది బాధితులు ఎన్ని దరఖాస్తులు వచ్చినా, ఉదారంగా సాయం మంజూరు చేస్తూ బాధితులకు అండగా నిలుస్తున్న సీఎం చంద్రబాబు నాయుడికి ధన్యవాదములు: సోమిరెడ్డి.

# వారధి సెంటర్ ప్రమాద బాధితులకు పరామర్శ

# తక్షణ ఆర్థిక సాయం అందించిన మంత్రి

**- బాధిత కుటుంబానికి అండగా మంత్రి నారాయణ**

**- 30 రోజుల్లో ఇల్లు కట్టించి ఇస్తామని భరోసా**





**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** 53వ డివిజన్ పరిధిలోని వారధి సెంటర్, షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఘోర ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. నియంత్రణ కోల్పోయిన ఒక లారీ డివైడర్‌ను దాటుకుంటూ వచ్చి పక్కనే ఉన్న నివాసంపైకి దూసుకెళ్లడంతో ఇంటికి ఉన్న నాలుగు గోడలలో మూడు గోడలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో మస్తానమ్మ హుస్సేన్ అనే ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, హుస్సేన్ కాలువ చీలిపోవడం, మస్తానమ్మ మెడ ఎముక విరిగి శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి రావడం వంటి విషాధకర పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం తెలుసుకున్న వెంటనే రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఘటన జరిగిన వెంటనే పదివేల రూపాయలను ఆర్థికంగా సాయం చేశారు. అనంతరం నెల్లూరుకు వచ్చిన వెంటనే నారాయణ స్వయంగా ఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితుల నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించడమే కాకుండా.. కూలిపోయిన ఇంటిని రాబోయే 30 రోజుల్లోగా పూర్తి స్థాయిలో పునర్నిర్మించి ఇస్తామని బాధితులకు గట్టి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, డివిజన్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవ చేయడానికి రాజకీయంలోకి వచ్చాం

**కాకాణి ఆడపిల్ల గురించి మాట్లాడే ముందు ఆలోచించుకో**

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**కొడవలూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు కల్పించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రతి గ్రామంలో ఇల్లు కొరత లేకుండా పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. గౌతమ్ నగర్ గ్రామంలో విలేజ్ హెల్త్ సెంటర్, చెత్త సేకరణ చేసే రిక్షాలు, నూతన పెన్షన్లు పంపిణీ మరియు శంకుస్థాపన, ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే విచ్చేయడంతో టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ** ఈ గ్రామ ప్రజలు ఆరోగ్య సమస్యల పట్ల ఎలాంటి ఇబ్బందులు పడకూడదని 36 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ గ్రామంలో సిసి రోడ్లు,సైడ్ కాలువలు కొరత లేకుండా పరిష్కారం చేస్తాం. స్మశాన వాటిక సమస్య కూడా పరిష్కరిస్తామని ఆమె అన్నారు. పేదలకు సేవ చేయడం కోసమే రాజకీయంలోకి విపిఆర్ దంపతులుగా ప్రజల్లోకి వచ్చామని అన్నారు. వి పి ఆర్ ఫౌండేషన్, కన్స్ట్రక్షన్ ద్వారా వికలాంగులకు ట్రై సైకిళ్లు, ప్రతి గ్రామంలో విపిఆర్ వాటర్ ప్లాంట్, మహిళలకు క్యాన్సర్ చికిత్సలు, కంటి వైద్య పరీక్షలు అద్దములు అందజేయుట, యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు, ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం ప్రజలకు సహాయం చేయడం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లక్ష్యం అని ఆమె అన్నారు. వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి ఆడబిడ్డ గురించి మాట్లాడే ముందు ఆలోచించుకొని మాట్లాడు? మీ ఇంటి నుండి కూడా ఆడబిడ్డని రాజకీయంలోకి తీసుకొస్తున్నావు, ఎవరు ఏంటో తెలుసుకొని మాట్లాడు. కాకాణి మంత్రిగా ఉన్నప్పుడు ఏనాడైనా గ్రామాలకు వచ్చిన పాపాన పోలేదు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సునీల్, భూలోకం విజయ్ కుమార్, ఉప సర్పంచ్ నవీన్, తువ్వార ప్రవీణ్ కుమార్, కోవూరు వెంకీ, భాషి, పంది శ్రీనివాసులు,పలు శాఖ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ధాన్యం సేకరించాల్సిందే మాజీ మంత్రి కాకాణి



**వెంకటాచలం ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** రైతులు పండించిన దానానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని మాజీ మంత్రి కాకాణి పేర్కొన్నారు. శనివారం సూటపాలెం గ్రామంలో పర్యటించి ఇటీవల మృతి చెందిన ఆరు మూల పుల్లయ్య కుమారుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని లేనిపక్షంలో వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో రైతులకు అండగా నిలుస్తామని గిట్టుబాటు కల్పించే వరకు పోరాటం చేస్తామని కాకాణి హెచ్చరించారు. ఆయన వెంట మండల వైసీపీ ఉపాధ్యక్షులు ఎం వెంకట శేషయ్య, మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నెల్లూరుకు కొత్త శోభ హరనాథపురం సర్కిల్‌లో

# సూర్య నమస్కార ప్రతిమల ఆవిష్కరణ




**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరులో అభివృద్ధి జాతర.. మంత్రి నారాయణ చొరవ అమోఘం.. ఎమ్మెల్యే కోటంరెడ్డి. నెల్లూరులో అభివృద్ధి జాతర.. మంత్రి నారాయణ చొరవ అమోఘం.. ఎమ్మెల్యే కోటంరెడ్డి. నెల్లూరు నగర సుందరీకరణలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. హరనాథపురం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అత్యద్భుతమైన సూర్య నమస్కార ప్రతిమలను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య సందేశాన్ని చాటిచెప్పేలా తీర్చిదిద్దిన ఈ విగ్రహాలు నగరానికి కొత్త శోభను తెచ్చాయి..

**మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ..** నెల్లూరు సిటీ, రూరల్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం అని. ఈ క్రమంలోనే ముత్తుకూరు రోడ్డు సరిహద్దులో సూర్య నమస్కార విగ్రహాలు, వాటర్ ఫౌంటైన్, వాకింగ్ ట్రాక్‌తో కూడిన ఆధునిక పార్క్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతత కోసం యోగా వేదికలను కూడా ఏర్పాటు చేస్తున్నాం అని. పేద పిల్లల భవిష్యత్తు మారాలంటే నాణ్యమైన చదువు ఒక్కటే మార్గం, అందుకే జుళి హైస్కూల్ తరహాలోనే నెల్లూరులోని అన్ని మున్సిపల్ ZP హైస్కూళ్లను రాబోయే రెండేళ్లలో అభివృద్ధి చేస్తాం అని మంత్రి తెలియచేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, సంక్షేమాన్ని ఆపడం లేదన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన దానికంటే ఎక్కువే చేస్తాం అని, ప్రజలు కొంచెం ఓపిక పట్టాలన్నారు.

**రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ** మా రూరల్ నియోజకవర్గ సరిహద్దు ప్రాంతమైన హరనాథపురం సర్కిల్‌లో నగర సుందరీకరణలో భాగంగా సూర్య నమస్కారాల ప్రతిమలను ఆవిష్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందని. మంత్రి నారాయణ చొరవతో నెల్లూరులో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనుల జాతర కొనసాగుతోందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మున్సిపల్ స్కూళ్లను అంతర్జాతీయ స్థాయిలో ఆధునికీకరించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం అని. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారాయణ సహకారంతో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో చారిత్రాత్మక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. 201419 మధ్య జరిగిన అభివృద్ధి మళ్ళీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక అదే వేగంతో ఊపందుకుంది అని ఎమ్మెల్యే తెలిపారు.

❖ ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ , కమిషనర్ నందన్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, రాష్ట్ర నాయకులు గిరిధర్ రెడ్డి, స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

**- ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



**గూడూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ఒకటో తేదీ సెలవు రోజు కావడంతో ముందు రోజే పెన్షన్లను కూటమి ప్రభుత్వం అందిస్తుందని హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. గూడూరు పట్టణ సమీపంలోని గాంధీ నగర్‌లో పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గెలిచిన వెంటనే పెన్షన్లను పెంచడం జరిగిందని ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ముందు రోజే అందిస్తున్నామని తెలిపారు. అలాగే హిందూ స్మశాన వాటికకు రెండు ఎకరాలు, ముస్లింలకు స్మశాన వాటికకు ఎకరా స్థలం కేటాయించామని తెలిపారు. కూటమీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి ఏ ప్రభుత్వంలో జరగలేదని ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయకులు పులిమి శ్రీనివాసులు, రహీం, శివ కుమార్, వైయస్సార్, అట్రాసిటీ సభ్యులు పెంచలయ్య, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ధ్వజారోహణం, శేష వాహనం

# గ్రామోత్సవం కన్నుల పండగ



**బిట్రగుంట ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండ బిట్రగుంటలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన ధ్వజారోహణం, కోడి ముద్దలు,శేష వాహనం, గ్రామోత్సవం కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక లోకంలో ముంచెత్తాయి.వేలాది మంది భక్తులు హాజరై స్వామివారి దివ్య దర్శనం పొందారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద మంత్రోచ్చారణల నడుమ ధ్వజారోహణం ఘనంగా జరిగింది. అనంతరం కోడి ముద్దల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా పుట్టం రెడ్డి విజయ్ కుమార్ రెడ్డి, పొట్టం రెడ్డి ప్రసాద్ రెడ్డి వ్యవహరించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.తదుపరి శేష వాహనంపై స్వామివారు అలంకార శోభతో గ్రామోత్సవంగా విహరించారు. శేష వాహనం మీద స్వామివారి విహారం కన్నుల పండగగా నిలిచింది.గ్రామ వీధులన్నీ విద్యుత్ దీపాలతో వెలుగొందగా, గోవిందా.. గోవిందా.. నామస్మరణలతో పరిసరాలు మారుమోగాయి. శేష వాహనం గ్రామోత్సవానికి ఉభయకర్తలుగా దేవరకొండ శ్రీనివాసులు, బంద్రెడ్డి సందీప్ కుమార్, పుట్టంరెడ్డి కృష్ణారెడ్డి, పుట్టం రామచంద్రారెడ్డి, పుట్టం ప్రదీప్ రెడ్డి, పుట్టం అశోక్ రెడ్డి, పుట్టం అజయ్ రెడ్డి, పుట్టం విష్ణు శంకర్ రెడ్డి వ్యవహరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల వేళ కొండ బిట్రగుంట ఆధ్యాత్మిక కాంతులతో ప్రకాశిస్తూ భక్తి సముద్రంగా మారింది.



# జిల్లాలో 92.23% సామాజిక పింఛన్ పంపిణి



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నెల్లూరు, శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఫించన్ల పంపిణీ కార్యక్రమ అనుసముద్రపుపేట మండలములోని కావలియడవల్లి సచివాలయము లో వేల్పులగుంట నందు స్వయంగా పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో వి. నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టరు, డి.ఆర్.డి.ఏ హాజరై అర్హులైన పించనుదారులకు సామాజిక భద్రత పించన్లు పంపిణి చేయడమైనది. జిల్లాలోని మొత్తం 291785 మంది అర్హులలో 269113 మందికి ఫిబ్రవరి 28వ తేది సాయంత్రం 7 గంటల వరకు బయోమెట్రిక్ అతెన్టికేషన్ ద్వారా పంపిణి చేసి, మొత్తం 92.23% పంపిణి పూర్తి చేయడమైనది. మిగిలిన పింఛన్లు త్వరితగతిన పంపిణి చేసేందుకు తగుచర్యలు కొనసాగుతున్నాయి.

## కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



**కోవూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** చిన్నారులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు అట్ల కాలనీలో శనివారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉంచు కోవడమే కాకుండా చిన్నారులకు ప్రభుత్వం ద్వారా వస్తున్న బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందజేయాలన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ చేస్తున్న జమ్మిపాలెం అంగన్‌వాడీ టీచర్ చెంచమ్మను శాలువా, పుష్పగుచ్ఛం మెమెంటోతో అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## మేడం క్యూరీని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలి





**కోవూరు,ఫిబ్రవరి28 ప్రభాతవార్త :** నోబెల్ బహుమతి గ్రహీత మేడం క్యూరీని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకుని శాస్త్రవేత్తలుగా తయారు కావాలని వైకేఆర్అండ్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో శనివారం సైన్స్‌డే కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి విద్యార్థిని మననం చేసుకోవడమే కాకుండా పఠన చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సైన్స్ అనేది మానవ జీవితంతో ముడిపడి ఉందన్నారు. ప్రాథమిక దశ నుంచే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ సైన్స్ పట్ల ఎంతో ఆసక్తి కనబరిచి వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుట్టారన్నారు. అటువంటి మహనీయుల జీవిత గాధలను ప్రతి విద్యార్థి ఆకళింపు చేసుకోవాలన్నారు. సైన్స్ అనేది మానవ జీవితంలో పూర్తిగా మిళితమై ఉందని అది ఎంతో ఉపయోగకరమని ఇటువంటి సైన్స్ ప్రయోగాల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. సైన్స్ అనేది కేవలం ప్రయోగశాలకే పరిమితం కాకూడదని, అది సమాజ పురోభివృద్ధికి కష్టాలు తీర్చే ఆయుధంగా ఉండాలని సర్‌సీవీ రామన్ తెలిపారన్నారు. రామన్ ఎఫెక్ట్ భౌతిక శాస్త్ర గమనాన్నే మార్చి వేసిందన్నారు. సైన్స్ రంగంలో నోబెల్ సాధించిన తొలి భారతీయుడుగా ఆయన చరిత్ర సృష్టించారన్నారు. పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమి ఫౌండేషన్ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ సైన్స్ అద్భుతమైన ప్రగతి సాధించినప్పటికీ అభివృద్ధి పేరుతో ప్రకృతిని విస్మరిస్తున్నామ న్నారు. నేడు సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ పర్యావరణ కాలుష్యం, భూమి నుంచి ఆకాశం వరకు కాలుష్యం ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయన్నారు. వ్యవసాయంలో విచ్చలవిడిగా పురుగుల మందులు వాడకం వలన నేలతల్లి నిస్సారమవుతుందన్నారు. ప్రశ్నించే స్థాయికి ప్రతి విద్యార్థి ఎదగాలని సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక దశ నుంచే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. సర్ సీవీ రామన్ చూపించే బాటలో విద్యార్థులు పయనించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రాథమిక దశ నుంచి ప్రశ్నించే తత్వాన్ని , గమనించే తత్వాన్ని అలవరుచుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. తాను నెలకు ఒక పర్యాయం ఈ పాఠశాలకు వస్తానని, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మరింత పదును పెట్టేలా చూస్తానన్నారు. సైన్స్ అంటే అన్వేషించడం అని, రెండు సంవత్సరాలల్లోనే నోబెల్ బహుమతి సాధించిన డాక్టర్ సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పచ్చిపాల రామనాథమ్మ అకాడమి ఫౌండేషన్ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి బాల శాస్త్రవేత్తగా తయారు కావాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు ఇవన్నీ నూతన సాంకేతికతను అలవరుచుకుని బాహ్య ప్రపంచంలోకి వచ్చాయన్నారు. వీటి పట్ల ఆసక్తి చూపి వాటిని ప్రయోజనకరంగా మనం మలుచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. బాల సైన్స్ వేత్తలను తయారు చేసేందుకు తమ ఎడ్యుకేషనల్ అకాడమి ముందుకు వస్తుందని, న్నారు. వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడి మాట్లాడుతూ ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మొక్కలు నాటడంపై దృష్టి పెట్టలన్నారు. డాక్టర్ సీవీరామన్ వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా విజ్ఞానాన్ని వివేకంతో జోడించి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. సైన్స్ పట్ల ప్రాథమిక దశ నుంచి అవగాహన చేసుకుని నూతన ప్రయోగాలకు పాఠశాలను వేదికగా మలుచుకోవాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోఫియా కిరణ్మయి, తదితరులు ప్రసంగించారు. అనంతరం సైన్స్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వి. సిరి, జి. శరవాణి, పి. సుష్మ, సీహెచ్ శ్రీకళ, డి. కావ్యలకు నగదు ప్రోత్సాహక బహుమతులను అకాడమి ద్వారా అందజేశారు. అంతకముందు సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అదేవిధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఆరు మంది విద్యార్థులకు 50 వేల రూపయాలను నగదు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె. భారతి, వి. సుచరిత, ఈ. రాజేశ్వరి, ఎన్. సుజన, కె. సుబ్బమ్మ, ఎన్. శైలజ, కె. శివజ్యోతి, పి. చంద్రమౌళి, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసూనను శాలువా, పుష్పగుచ్ఛంతో పాఠశాల యాజమాన్యం సత్కరించారు.

## పింఛన్ల పంపిణీలో జిల్లాస్థాయిలో ద్వితీయస్థానం



**కోవూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** : కోవూరు మండలంలో పోతిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు పింఛన్ల పంపిణీ పరిశీలించి పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సెక్రటరీల పూర్తి సహకారంతో జిల్లాలోనే పింఛన్ల పంపిణీలో ద్వితీయ స్థానం సాధించడం జరిగిందన్నారు. 9225 పింఛన్లకు గానూ 8551 పింఛన్లు పంపిణీ చేసి 92.69శాతం సాధించడం జరిగిందని, ఇందుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## నూరుశాతం ఫలితాలు సాధించాలి



కోవూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో రానున్న పదవ తరగతిలో నూరుశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా సంక్షేమాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి అన్నారు. కోవూరులోని ఏఎస్‌డబ్ల్యూ కార్యాలయంలో శనివారం ఆమె సాంఘిక సంక్షేమాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలకు రెండు వారాలు మాత్రమే గడువు ఉందని , ఈ కొద్ది సమయాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ఏఎస్‌డబ్ల్యూ పరిధిలో సంక్షేమాధికారులతో పదవ తరగతి పరీక్షలపై సమీక్ష నిర్వహిస్తు న్నామన్నారు. ప్రతి సంక్షేమ వసతి గృహంలో గ్రీనరీగా కిచెన్ గార్డెన్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి వసతి గృహంలో ఆదివారం క్విజ్, స్పోర్ట్స్ తదితర అంశాలపై విద్యార్థులు దృష్టి పెడితే మెదడు కాస్త పదును అవుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే భోజనం విషయంలో జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. హైజీనిక్ తదితర విషయాల్లో ఐదవ స్థానంలో ఉందని, దీనిని మొదటి స్థానంలోకి వచ్చేలా సంక్షేమాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లకుండా వసతి గృహంలోనే ఎక్కువకాలం ఉండేలా సహకరించాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ పట్ల సంక్షేమాధికారులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారుల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్య, సంక్షేమాధికారులు ఉన్నారు.

## వైజ్ఞానిక స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



**కోవూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి మారుతున్న కాలానికి అనుగుణంగా వైజ్ఞానిక స్ఫూర్తిని పెంపొందించుకుని వివిధ సాంకేతికతలపై పట్టు సాధించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రీనివాస్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ సైన్స్‌డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ విజ్ఞాన శాస్త్రానికి అమూల్యమైన సేవలు అందించార న్నారు. ఇంజనీరింగ్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితశాస్త్రం, నూతన కంప్యూటర్ సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానానికి ఆధారంగా నిలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల విభాగాధిపతి డాక్టర్ పీఎం కిషోర్ మాట్లాడుతూ కళాశాల ఎస్అండ్ హెచ్ విభాగం ప్రతిసంవత్సరం సైన్స్‌డే కార్యక్రమాన్నినిర్వహించడం జ రుగుతుందన్నారు. ఏర్పాటు చేసిన పలు సైన్స్ మోడల్స్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

## విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి అలవర్చుకోవాలి



**వింజమూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి అలవర్చుకోవాలని నేతాజీ వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కేవీ రత్నం పేర్కొన్నారు.శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పుష్క రించుకుని విద్యార్ధినీ, విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు.పలు పాఠశాలల్లో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఏబీవీపీ నగర కార్యదర్శి విష్ణు విద్యార్థులు చందు రెడ్డి, రామకృష్ణా కమలేష్‌లు సందర్శించి డాక్టర్ సీవీ రామన్ అందించిన విజ్ఞాన శాస్త్రాన్ని విద్యార్థులు అవపోషణ పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సీవీ రామన్ ఆసియా ఖండంలోని మొట్టమొదటి నోబుల్ బహుమతి పొందిన శాస్త్రవేత్త అని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాఠశాలకు విచ్చేసి ఉపాధ్యాయులు సూచించిన విధంగా విద్యను అభ్యసించాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకుఎడ్యుకేషనల్ అకాడమి బంపర్ ఆఫర్

**- 590 మార్కులు సాధిస్తే2 లక్ష రూపాయలు- రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంక్ సాధిస్తే రూ. 5 లక్షలు**



**కోవూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు రానున్న పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధిస్తే వారికి తమ ఫౌండేషన్ ద్వారా రూ. 5 లక్షలు నగదు బహుమతిని అందిస్తామని విద్యార్థినుల హర్షధ్వానాల మధ్య . పచ్చిపాల రామనాథమ్మ అకాడమి ఫౌండేషన్ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి అన్నారు. మాట్లాడుతూ ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు 590 మార్కులు సాధిస్తే పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమి ద్వారా2 లక్ష రూపాయలు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని విద్యార్థినుల హర్షధ్వానాల మధ్య పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమ్ది ప్రకటించారు. అదేవిధంగా 590 మార్కులు ఎంతమంది సాధించినా వారందనికీ ఒక్కొరికి2 లక్ష రపాయలు బహుమతి అందజేస్తామన్నారు. ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని అలవరుచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోఫియా కిరణ్మయి, వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, వైకేఆర్అండ్‌కే డిగ్రీ కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన, సైన్స్ ఉపాధ్యాయులు కె.భారతి, వి. సుచరిత, ఈ.రాజేశ్వరి, ఎన్.సుజన, కె.సుబ్బమ్మ, ఎన్. శైలజ, కె. శివజ్యోతి, పి. చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.

**- ట్రస్టు ద్వారా రూ. లక్ష ప్రోత్సాహక బహుమతులు** గత సంవత్సరం పదవ తరగతిలో స్కూల్ టాపర్‌గా నిలిచిన ముగ్గురికి పచ్చిపాల రామనాథమ్మ అకాడమి ఫౌండేషన్ ద్వారా లక్ష రూపాయలు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మొదటిస్థానం సాధించిన వేదనక్షత్రకు రూ. 50 వేలు,రెండవ స్థానం సాధించిన పి. పెంచల దిశకు 30వేలు, మూడవ స్థానంసాధించిన బి. వెన్నెలకు 20 వేలను అకాడమిక్ చైర్మన్‌రాధాకృష్ణారెడ్డి విద్యార్థులకు అందజేశారు.విద్యార్థులతో పాటువారి తల్లిదండ్రులుకూడా ఉన్నారు.

## పెన్షన్లు అందజేసిన ఎంపీడీవో నగేష్ కుమారి



**విడవలూరు,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మండలంలోని రామతీర్థం గ్రామంలో స్థానిక ఎంపీడీవో నగేష్ కుమారి పెన్షన్ కు అర్హులైన వారికి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి పెన్షన్లు సకాలంలో అందజేయడం, సచివాలయం సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి గౌరవంగా మాట్లాడుతూ పంపిణీ చేస్తున్నారా లేదా అని పెన్షన్ దారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పెన్షన్ దారుల నుండి ప్రభుత్వం మూడు నియమాలను వేలిముద్ర ద్వారా తెలుసుకోవాలని సూచనలు ఉన్నవి.కాబట్టి సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా ఆన్లైన్ వేలిముద్ర ద్వారా అవునా, కాదా అనే అంశాన్ని నమోదు చేయాలని ఎంపీడీవో ఆదేశించారు.ఎస్టీ కాలనీలో ఈ కేవైసీ ద్వారా కుటుంబ సభ్యులను నమోదు కార్యక్రమం వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ కుటుంబ సభ్యులను పరామర్శ మాజీ మంత్రి



**విడవలూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:**మండలం దంపూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు సోల శీనయ్య మాతృమూర్తి సోల రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ మంత్రి, పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి స్వర్గీయ రమణమ్మ మృతికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, అనపల్లి ఉదయ భాస్కర్ , మస్తానయ్య, ఉప సర్పంచ్ నాగేళ్ల శీనయ్య , అంకబాబు , పార్వత్తుతురు పర్వతూరు శ్రీను, వెంకటేశ్వర్లు, తలరీ భాస్కర్, మణికలా శ్రీనివాసులు,తాత శ్రీనివాసులు మరియు స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## వన్ మంత్ ఫోర్ విజిట్ గ్రామ సభలు వినియోగించుకోండి



**విడవలూరు,ఫిబ్రవరి28ప్రభాత వార్త:** మండలంలోని చౌక చర్ల పంచాయతీ నందు వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్ కార్యక్రమం వచ్చేనెల నాలుగో తేదీ నుండి గ్రామసభలు జరుగుతాయని స్థానిక తహశీల్దార్ కె. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా 4,11,18,25 తేదీల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుంది. రైతులు పాల్గొని భూమికి సంబంధించి సమస్యలను స్వచ్ఛందంగా తెలిపి పరిష్కరించుకోవాలని కోరారు.

## మంత్రి స్పెషల్ విజిట్.. టీ కొట్టు యజమానికి సర్ప్రైజ్ ఇచ్చిన నారాయణ



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త –వైద్యం** నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా మంత్రి నారాయణ టీ ముచ్చట్లే హాట్ టాఫిక్.. ఎప్పుడూ అభివృద్ధి పనుల సమీక్షలు, పర్యటనలతో బిజీగా ఉండే మంత్రి ఒక్క సారిగా తనలోని సామాన్యుడిని బయటకు తీశారు. నగర పర్యటనలో భాగంగా ఎటువంటి బేషజాలు లేకుండా ఒక సామాన్య టీ కొట్టు వద్ద ఆగి, అక్కడ ఉన్న వారితో కలిసి వేడి వేడి టీ తాగుతూ సందడి చేశారు. కేవలం టీ తాగడమే కాకుండా, దుకాణదారుడి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ, వ్యాపారాలు ఎలా ఉన్నాయి..? జనాల్లో పరిస్థితి ఏంటీ..? అంటూ ఆత్మీయంగా పలకరించడం అందరిని ఆశ్చర్యపరిచింది. మంత్రిగారి వెంట ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ చైర్మన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, కమీషనర్ నందన్ కూడా టీ గ్లాసులతో లైన్‌లో నిలబడడంతో ఆ ప్రాంతమంతా జాతరను తలపించింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అందరూ ఇలా నడిరోడ్డుపై సామాన్యులతో మమేకమవ్వడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ మంత్రి గారి టీ పార్టీ ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.

## పీజీ కళాశాల నందు సైన్స్ దినోత్సవ వేడుకలు



**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** కావలి విక్రమ సింహపురి యూనివర్శిటి కళాశాలలో ప్రొఫెసర్ వి.శైలజ అధ్యక్షతన శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా ఫిజియోథెరపి డాక్టర్ కె.మాధవరెడ్డి గౌరవ అతిధిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాదవరెడ్డి సైన్స్ రీసెర్చ్ నందు మహిళల ప్రాముఖ్యత వికసిత భారత్ గురించి తెలిపారు. ఈ సందర్భంగా పిజి విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్,సైన్స్ క్విజ్; పోస్టర్ ప్రెజెంటేషన్‌లో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానంచేశారు. మహుమతి గ్రహితులను ప్రొపెసర్ శ్రీనివాసరావు, డాక్టర్ మాదవరెడ్డి, డాక్టర్ శైలజ అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు. మాదవరెడ్డిని శాలువాతో సత్కరించడం జరిగింది.

## శ్రీసాయి విద్యానికేతన్ నందు సైన్స్ దినోత్సవ వేడుకలు



**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** కావలి వాయునందన ప్రెస్‌రోడు సంకులవారితోటలోని శ్రీ సాయివిద్యానికేతన్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం శనివారం కరస్పాండెంట్ కత్తి వెంకటక్రిష్ణరావు, ప్రిన్సిపాల్ అలివేణిల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ విజ్ఞానిక ప్రదర్శనలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ప్రదర్శించడం జరిగింది. ముఖ్య అతిధులుగా అధ్యాపకులు పి.అశోక్‌కుమార్ పాల్గొని ప్రాజెక్టు నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ ప్రదర్శనలు పట్టణ ప్రముఖులను ఆకట్టుకోవడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లక్ష్యసాధనకు క్రమశిక్షణే పునాది: ఎస్సై నాగార్జునరెడ్డి



**ఇందుకూరుపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** విద్యార్థులు చిన్నప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కఠోర శ్రమతో చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఇందుకూ రుపేట ఎస్సై నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. శనివారం అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇందుకూ రుపేట మండలం ముదివర్తిపాలెం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఎస్సై నాగా ర్జునరెడ్డి, మండల విద్యాశాఖాధికారి సునీల్ విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదలను అలవర్చుకుంటే ఏ రంగంలోనైనా అద్భు తాలు సృష్టించవచ్చని సూచించారు. పరీక్షలను చూసి భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అమ్మచారిటబుల్ ట్రస్టు సేవా గుణంపై ప్రశంసలు విద్యార్థులను ప్రోత్సహించేందుకు సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అమ్మచారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు దొడ్ల మల్లిఖార్జునను ఈ సందర్భంగా పలువురు ప్రత్యేకంగా అభినందించారు. పేద విద్యార్థులకు అండగా నిలవడంలో ట్రస్టు చూపుతున్న చొరవ అభినందనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి పొన్నెబోయిన చెంచు కిషోర్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కలువాయిలో ఘనంగా టైలర్స్‌డే వేడుకలు



**కలువాయి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** మండలకేంద్రమైన కలువాయిలో టైలర్స్‌డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. టైలర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గాజుల మల్లికార్జున ఆధ్వర్యంలో టైలర్ షాపులు మూసివేసిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యాచకులకు,వృద్ధులకు తినుబండారాలు అందజేశారు. ప్రస్తుతం పరిస్థితులలో రెడిమెడ్ దుస్తులు ఎక్కువ అవడంతో టైలర్ల కు ఆదరణ తగ్గిపోయిందనివారు వాపోయారు.ఈ కార్యక్రమంలో మండలంలోని టైలర్లందరు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల దాతృత్వానికి 11 సంవత్సరాలు



**కలువాయి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బివిఎస్ఆర్ జడ్పి హైస్కూల్ నందు 1989-90 సంవత్సరంలో పదో తంగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్‌ప్లాంట్‌ను అందజేసి పదకొండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శనివారం పాఠశాలలో వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు వేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థి, వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు మదిలేటిగడ్డ నరసింహులు మాట్లాడుతు పాఠశాలకు అప్పటి రోజుల పరిస్థితితులు దృష్టిలో ఉంచుకొని చిన్నారులకు ప్రతినిత్యం నీటి సౌకర్యం అందుబాటులో ఉండాలని ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.వాటర్‌ప్లాంట్ నిర్వాహకునుకు 6 లక్షల రూపాయాలు పూర్వ విద్యార్దులు సహకారం అందించగా ప్లాంట్ నిర్వహణకు మూడు లక్షల రూపాయాలు డిపాజిట్ చేసి నిర్వహణ కొనసాగిస్తున్నారు.అదనంగా అయ్యే ఖర్చులను సొంత నిధులు వెచ్చింది మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నామని నరసింహులు తెలిపారు.ఈకార్యక్రమంలో ప్లాంట్ నిర్వాహకులు సింగనమల విజయ్ కుమార్,మహేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



**మనుబోలు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** మనుబోలు మండలం బద్దెవోలు క్రాస్‌రోడ్డులోని సంగమేశ్వర గిరిజన కాలనీలో శనివారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. యాకసిరి రత్నం అనే గిరిజనుడి ఇల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో కాలిపోయింది. ఒక్కసారి ఇంట్లో నుండి పొగలు ఆ తరువాత మంటలు వ్యాపించడంతో మంటలను ఆర్పి వేసే లోపు పూర్తిగా ఇల్లు దగ్ధమైపోయింది. దీనితో ఇంట్లోని కట్టు బట్టలు నిత్యావసర సరుకులు 30 వేల రూపాయాలు నగదు పూర్తిగా కాలిపోయాయి. 50 వేలు రూపాయాలు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

## ఇస్కపల్లిలో పేకాట రాయుళ్ళు అరెస్టు

**అల్లూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** అల్లూరు మండల పరిధిలోని ఇస్కపల్లిపాలెంలో పేకాట స్థావరంపై జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు కావలి రూరల్ సిఐ పాపారావు అల్లూరు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, దగదర్తి ఎస్ఐ సుమన్ బోగోలు, ఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది పేకాట స్థావరంపై మెరుపు దాడి చేసి 15మంది పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకొని రూ.1,50వేలు నగదు స్వాదీనం చేసుకొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ



**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ భరసా ఫించన్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాలతో మూడవ క్లస్టర్‌కు చెందిన స్థానిక 32వ వార్డులో శనివారం పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో క్లస్టర్ఇన్‌చార్జ్ అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్త,, టిడిపి నాయకులు వల్లపుకుమార్, సచివాలయం అడ్మిన్,వార్డు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కావలిలో ఘనంగా టైలర్స్‌డే వేడుకలు



కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : కావలి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 33వ వార్షికోత్సవాన్ని పురష్కరించుకొని శనివారం టైలర్స్ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో టైలర్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఏఎంఎస్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్స్ దర్జీలను శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. ముఖ్య అతిదులుగా పాల్గొన్న ఆసంఘ గౌరవ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్త మాట్లాడుతూ టైలర్స్ సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పి.పెంచలయ్య, గౌరవ సలహాదారులు షేక్‌రఫి, అధ్యక్షులు ఎం.రమేష్, ఉపాధ్యక్షులు వై.శ్రీహరి, పి.మాల్యాద్రి ఎస్‌డి అల్తాఫ్, షేక్ రసూల్, కోశాధికారి పి.వేణు, లోక్‌సత్తా మాలకొండ రెడ్డి, టైలర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నగరంలో భారీ దొంగతనం

**- 20 సవర్ల బంగారు ఆభరణాలు, రూ. 3 లక్షల నగదు చోరీ**



**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** నగర నడిబొడ్డున శనివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ముత్తుకూరు బస్టాండ్ సమీపంలో నాగరత్న అనే మహిళ ఒంటరిగా ఉంటూ.. ఉదయం పూట టిఫిన్ బండి వ్యాపారం జీవనోపాధిగా సాగిస్తూ వస్తోంది. శనివారం తెల్లవారు జామున ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె నివాసం వద్దకు చేరుకుని, తలుపులు పగల గొట్టి లోనికి ప్రవేశించి, ఆమెను తాళ్లతో బంధించారు. అనంతరం ఇంట్లో ఉన్న 20 సవర్ల బంగారు ఆభరణాలు, రూ. మూడు లక్షల నగదును దోచుకుని వెళ్లారు. నిందితులు వెళ్లిన తర్వాత చేతికట్లను చిన్నగా తొలగించుకుని నాగరత్న ఇంటి నుండి బయటకు వచ్చి చుట్టుపక్కల వారికి జరిగిన సమాచారం తెలిపారు. వారి సూచనతో పోలీసులకు సమాచారం అందించగా చిన్న బజారు సీఐ చిట్టెం కోటేశ్వరరావు, సిసిఎస్ సీఐ సీతారామయ్యలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీం ఇంటి వద్దకు చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిన్న బజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**నెల్లూరు క్రైం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహన ఢీకొనడంతో సుమారు 35 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందాడు. సంఘటన వివరాలు అందుకున్న నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు



**మనుబోలు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** మనుబోలు మండల కేంద్రంలోని జడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం భారత శాస్త్రవేత్త సివిరామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్‌ను స్మరించుకుంటు నేషనల్ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్దులు ఒక్కొక్క శాస్త్రవేత్త గురించి వివరించారు. విద్యార్ధుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు డాన్స్ ప్రోగ్రాములు అందర్ని ఆకట్టుకున్నాయి. అనంతరం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో విద్యార్దులు తయారు చేసిన వివిధ సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఉత్తమ ప్రయోగానికి బహుమతులను సర్టిఫికేట్లను ప్రదానంచేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అమూల్యకుమారి ,ఉపాధ్యాయులు మాదవరావు, కామేశ్వరి, జ్యోతిలక్ష్మి, పిడి మంజువాణి శ్యామల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 310 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత : డీఎస్ఓ లీలారాణి వాహన తనిఖీలు



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** శనివారం ఏపి 26 టిఈ 4444 నంబరు గల వాహనంలో అక్ర మంగా తరలిస్తున్న 310 క్వింటాళ్ల, పిడిఎస్ బియ్యం ఒంగోలు నుండి వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద జిల్లా పౌడర్ జిల్లా పౌర సంబంధాల శాఖధికారి లీలారాణి, ఏఎస్‌ఓ లక్ష్మినారాయణ, తమ సిబ్బందితో తనిఖీ చేయగా లారీ వాహనం పట్టుకున్నారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్‌కు వాహనం తరలించారు.

## హనుమంతసేవ ఉత్సవంలో శ్రీవేణుగోపాలస్వామి వారు



**బుచ్చి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామంలో కొలువైవున్న శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణు గోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా హనుమంతసేవ ఉత్స వం కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు స్వామి వారి ని దర్శించుకొని తరించారు. ఉభయకర్తలుగా పాటూరు ప్రమీలమ్మ, పెనాక అమర్‌నాద్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పెనాక ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

## గిరిజనులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** గిరిజనులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, టిడిపి సీని యర్ నాయకులు మొగిలి కల్లయ్య తెలిపారు. కావలి ఎమ్మె ల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు శనివారం 18వ వార్డులో పెన్షన్ల కార్యక్రమాన్ని గిరిజనులకు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఆయన మా ట్లాడుతూ వికలాంగులకు రూ.6వేలు, వృద్దులకు రూ.4వేలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం అన్ని విధాల గిరిజ నులను ఆదుకుటుందన్నారు. గిరిజనులకు అందిస్తున్న పలు ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఈకార్య క్రమంలో సచివాలయ సిబ్బంది,కూటమి నేతలు పాల్గొన్నారు.

## విట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హమరాజ్‌కు అభినందనలు



**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** : పివిఆర్ విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజి కల్ డైరెక్టర్ ఎస్‌కె హమరాజ్‌బాషను పలువురు అభినందించడం జరిగింది. ఈయన విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తూ వాలీబాల్ కోచ్‌గా బెంగుళూరు స్పోర్ట్స్ అథారిటి ఆప్ ఇండియా నేతాజి సుభాష్ నేషనల్ ఇనిస్టూట్‌ఆప్ స్పోర్ట్స్ సదరన్ సెంటర్ వారు నిర్వహించు సర్టిఫికెట్ కోర్సు ఇన్ వాలీబాల్ కోచింగ్(42రోజులు) డిసెంబర్ 22వ తేది నుంచి జనవరి 17వరకు ఆన్‌లైన్‌లో, ఫిబ్రవరి 9వ తేది నుంచి ఫిబ్రవరి 25వరకు ఆఫ్‌లైన్‌లో కోర్సు చేసి అందులో ప్రతిభ కనపరచి బిగ్రేగ్ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా శనవారం వాలీబాల్ క్రీడాసంఘం, జవహర్‌భారతి ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంటు అభినందించారు. హ మ్‌రాజ్ ఆర్మీలో 21ఏళ్ళు సుదీర్ఘంగా క్రమశిక్షణతో మెలిగారన్నారు. భవిష్యత్తులోవాలీబాల్ కోచ్‌గా అధిక మం దిని తయారుచేసి కావలికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తెచ్చి క్రీడాకరులను అందించగలరని కోరారు.

## జిల్లాలో విస్తరిస్తున్న మెడికల్ మాఫియాను అరికట్టాలి




**కావలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** జిల్లాలో విస్తరిస్తున్న మెడి కల్ మాఫియాను అరికట్టాలని సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఏరి యావైద్యశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వురు మాట్లాడుతూ క్రిస్టియన్‌పేట, నెల్లూరు పొగతోటలో ఇతర ప్రాంతాల్లో మెడికల్ మాఫియా చెలరేగిపోతుందని పేర్కొన్నారు. రూ.500లు అడ్మిషన్‌ఫీజు, టెస్టులకు వేలాది రుపాయలు వసూ లుచేస్తున్నారని తెలిపారు. మందలకు జీఎస్‌టి తగ్గించినప్పటికి పాతరేట్లు ప్రకారం అమ్ముతూ పేద ప్రజలను పీడించుకొని తింటున్నారని తెలిపారు. మాఫీయా విస్తరించి ప్రైవేటు వైద్యులే ప్రభుత్వ వైద్యులుగా అవతారం ఎత్తి తూతూ మంత్రంగా చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చూసి ప్రైవటే వైద్యశాలలకు రెఫర్ చేస్తున్నారని తెలిపారు. ఎటు చేసినా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వల్ల పేదరోగులు బలైపోతున్నారని తెలిపారు. సిపిఐరాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామా అంకయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పి.నాగరాజు, సహాయ కార్యదర్శి బోసు, సమితి సభ్యులు పి,నరసింహా, కుమ్మరి గుంట చిట్టిబాబు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు రాజా, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లి, దళిత నాయకులు నరసింహరావు, ముక్కు మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క రోజు ముందే పెన్షన్లు పంపిణీ చేసిన ఘనత సిఎం చంద్రబాబుదే



**ముత్తుకూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ఒక్క రోజు ముందే పెన్షన్లు పంపిణీ చేసిన ఘనత సిఎం చంద్రబాబుదే అని టిడిపి మండల యువత అధ్యక్షులు రా గాల శివకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కృష్ణపట్నం పంచాయితీలో శని వారం పెన్షన్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో ఒక్కొక్కటిగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలను సిఎం చంద్రబాబు నాయుడు పొందుతున్నారని పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.

## విద్యార్థుల ప్రతిభకు వేదికగా నాగార్జున సైన్స్ ఎక్స్పో-2026



**పొదలకూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** పట్టణంలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్పో-2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. విజ్ఞానోత్సాహంతో నిండిన ఈ కార్యక్రమం విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. ఏ.ప్రసన్న రాజేష్, మండల విద్యాధికారి 2 శోభనాద్రి, పొదలకూరు వ్యవ సాయ శాఖ ఏడిఏ శివ నాయక్ విచ్చేసి విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించారు. క్లాస్‌వైజ్ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.అనంతరం పొదలకూరు వ్యవ సాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రసన్న రాజేష్, ఎంఈఓ-2 శోభనాద్రి కలిసి సైన్స్ ఎక్స్పోను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ఆరంభించారు. ముం దుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అతిథులు మా ట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాసక్తి పెంపొందించేందుకు ఇలాంటి ఎక్స్పోలు దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందంజ వేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు తయారు చేసిన రోబో మోడళ్లు, డ్రోన్ కెమెరాలు, పర్యావరణ సంరక్షణ నమూనాలు, స్మార్ట్ సిటీ కాన్సెప్ట్‌లు తదితర ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతి ప్రాజెక్టులోనూ సృజనాత్మకత, వినూ త్న ఆలోచనలు స్పష్టంగా కనిపించాయి.మొత్తానికి, నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎక్స్పో-2026 విజ్ఞానవంతమైన వాతావరణంలో విజయవంతంగా సాగింది. విద్యార్థుల ప్రతిభకు ఇది ఉత్తమ వేదికగా నిలిచింది.స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి దుర్గా, మేనేజ్‌మెంట్ ఎం సుధాకర్ రెడ్డి, జి నారా యణరెడ్డి, ఏ సుబ్బారావు, ఏ చంద్రశేఖర్, జివిఆర్, కె పాపయ్య, చల్లా వెంకటకృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆవిష్కరణలకు వేదికగా జాతీయ సైన్స్ ఫెయిర్



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** మండలంలోని నరుకూరు గ్రామ పరిధిలో ఉన్న ఎయిమ్స్ స్కూల్‌లో జాతీయ సైన్స్ ఫెయిర్‌ను శాస్త్రీ య వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ పల్నాటి వెంకట సురేష్ హాజరై,విద్యార్థులు స్వ యంగా రూపకల్పన చేసిన శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాత్మక ప్రాజె క్టు లు, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ఆసక్తిగా పరిశీలించారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, పర్యావరణ శాస్త్రం తదితర విభాగాలకు చెందిన ప్రాజెక్టులు ప్రదర్శించబడగా, విద్యార్థులు సిద్ధాంతాత్మక అం శాలను ప్రయోగాత్మక విధానాలతో అనుసంధానిస్తూ తమ పరిశోధనా దృక్పథాన్ని ప్రతిబింబించారు. ఈ సం దర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌ల ద్వారా విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సృజనా త్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు పరిశోధనా మనోభావం పెంపొందుతాయనితెలిపారు. ప్రతి సంవ త్సరం పాఠశాల సిబ్బంది ప్రోత్సాహంతో ఈ శాస్త్రీయ ప్రదర్శనను నిర్వహిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ అవగా హన విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. కరస్పాండెంట్ పి.వి. రమణమూర్తి, ప్రధా నోపాధ్యాయులు జి. వెంకట్ స్వామి, సైన్స్‌ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసులు, అశ్విని,జి.లికితఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** పేదల సేవలో మన ప్రభు త్వం కార్యక్రమంలో భాగంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశానుసారం మండలంలోని నరుకూరు, ఈదూరు, సౌత్ ఆములూరు తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉద యం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి వృద్ధులు,వికలాంగులు, వితంతు వులకు పెన్షన్లు అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు కొణతం రఘుబాబు పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే మండల ప్రధాన కార్యదర్శి మన్యం జితేంద్ర గౌడ్, మధుసూదన్ గౌడ్, యూనిట్ ఇంచార్జ్ ఆరికాటి వెంకటేశ్వర్లు, గ్రా మ పార్టీ అధ్యక్షులు మారంరెడ్డి సమంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాకం వెంకయ్య, గ్రామ నాయ కుడు కొణతం శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది చిట్టిబాబు, దీపక్, హరిబాబు, జావెద్, పెం చలయ్య, పద్మిని, విఆర్వో జనార్దన్, ఏఎన్ఎం ప్రశాంతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొండ బిట్రగుంటకు వేమిరెడ్డి దంపతులు రాక

**బిట్రగుంట ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదివారంలో జరిగే పుష్కరిణి ప్రారం భోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, కార్యనిర్వ హణాధికారి అరవ రాధాకృష్ణ తెలిపారు. కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థా నంలో దిగువ బాగున పుష్కరిణి జీర్ణద్దారణ పనులకు వి పి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున రెండు కోట్ల 25 లక్షల రూపాయలతో ఆధునీకరించటం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులచే ప్రారంభిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి ఆలయ కార్యనిర్వాహన అధికారి అరవ రాధాకృష్ణ తెలిపారు ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తో పాటు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

## 'నందవరం' కుటుంబాన్ని పరామర్శించిన వైసిపి నాయకులు

**ఆత్మకూరు, ఫిబ్రవరి28,ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సి పల్ కో-ఆప్షన్ మెంబర్ నందవరం కృపావరమ్మ భర్త , వైఎస్ఆర్‌సిపి నాయకుడు నందవరంప్రతాప్ తండ్రి నంద వరం చంద్రన్ మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి ఆత్మకూరు వైఎస్ఆర్‌సిపి నాయకులు శనివారం నివాళుల ర్పించారు. 20వ వార్డులోని వారి నివాసానికి వెళ్ళి చంద్రన్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యుల కు ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర మున్సిపల్ విభాగ కార్యదర్శి అల్లారెడ్డి ఆనం ద్‌రెడ్డి, పట్టణ వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు తోడేటి మణి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించిన మాజీఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఫోన్‌లో ప్రతాప్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. చంద్రన్ మృతికిగల కారణాలను అడిగి తెలుసుకొని కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని తెలిపారు.

## పోలిరెడ్డిపల్లి జడ్పీహైస్కూల్‌ను సందర్శించిన ఎస్ఐ



**మర్రిపాడు, ఫిబ్రవరి28,ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం లోని పోలిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపా ఠశాలను శనివారం మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావు సందర్శించారు.ఎస్ఐ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎస్ఐ తమతో కలిసి భోజనం చేయడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఠాగూర్ స్కూల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



అనుమసముద్రంపేట, ఫిబ్రవరి28,ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ఠాగూర్‌ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం పాఠశాల కరస్పాండెంట్ సి.హెచ్.వి.రమణారెడ్డి, డైరెక్టర్ కె.దొరస్వామిరెడ్డిల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినో త్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1నుంచి 9వ తం గతి వరకు విద్యార్థులందరూ పాల్గొని 116ప్రాజెక్టులను తయారు చేసి వాటిని గురించి పూర్తి సమాచారాన్ని ఇచ్చారు.దీని ఫలితంగా విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను బయటకు తీసి విద్యార్థులను ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ పొందే విధంగా తయారు చేయడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు అద్భుతంగా విద్యార్థులతో ఇన్ని ప్రాజెక్టులను తయారు చేయించారని వారికి పాఠశాల తరపున ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామని పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కె.పి.ప్రసాద్, ఎ.సుమతి, టి.ప్రసన్నకుమార్, ఎస్.కె.ఖాజారసూల్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని వారు పేర్కొన్నారు. సైన్స్ ప్రాధాన్యతను విద్యార్థులకుతెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులకుప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రత్యేకంగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాణసంచా ప్రమాదంలో 20 మంది మృతి, తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది

**- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణ సంచా తయారీ కేంద్రంలో చోటు చేసుకున్న భారీ ప్రమాదంపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 20 మంది మృతి చెందటం కలచివేసిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవడం చాలా బాధాకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ప్రతి విద్యార్థి వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి



**వింజమూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** విద్యార్థులు మొదటి నుండి వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఇన్ఫాంట్ జీసస్ ఇంగ్లీష్ మీడి యం పాఠశాల కరస్పాండెంట్ ఎస్ ఐజాక్ తెలిపారు. శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం నిర్వహించిన సైన్స్ ప్ర యోగాలను ఆయన పరిశీలించారు. బాల బాలికలు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇదే విధంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంచుకొని విజ్ఞాన శాస్త్రాన్ని ఆవపోషణ పట్టాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ సీవీ రామన్ సము ద్రపు నీటిపై సూర్యకాంతి పడినప్పుడు ఆ కాంతిలోని నీలిరంగు ఎక్కువగా పరిక్షేపం మన కంటికి చేరడం వల్ల సముద్రం నీలంగా కనిపిస్తుంది అని తెలిపారు. దీనినే రామన్ ఎఫెక్ట్ అని పిలుస్తారన్నారు. కాంతి కిర ణాలు ఒక ద్రవపదార్థంపై పడినప్పుడు ఆ కాంతి పరిక్షేపం చెందుతుందన్నారు. కాంతి కిరణాలలో ప్రోటాన్ కణాలు ద్రవపదార్థాల పరమాణువులపై పడి పరిక్షేపం చెందుతాయి అని తెలిపారు. అలా ప్రోటాన్లు పడే టప్పటికి పౌన:పుణ్యంలో చెదిరిపోతే కొన్ని ప్రోటాన్లు మాత్రం అంతకు తక్కువ పౌన:పుణ్యంతో పరిక్షేపం చెందుతాయని అంటే అందులో కొంత భాగం వేరే పౌన:పుణ్యంతో వెనుతిరుగుతుందన్నారు. దీని ద్వారా రసాయనిక పదార్థాలలో అను పరమాణు నిర్మాణాల పరిశీలన చేయవచ్చు అన్నారు. సివి రామన్ భార తదేశంలోనే కాక ఆసియా ఖండంలోనే నోబెల్ బహుమతిని పొందిన మొదటి శాస్త్రవేత్తగా ప్రసిద్ది చెందా రన్నారు. విద్యార్థులు సివి రామన్ వంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని కొత్త కొత్త ఆవిష్కరణలు దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.మాధవరావు, పాఠశాల వ్యవ స్థాపక డైరక్టర్ ఎస్.డేవిడ్, ఉపాధ్యాయులు రజియా ఖాజా హుస్సేన్, బసవచారి, ఇతర ఉపాధ్యాయ బృం దం విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రవి ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**వింజమూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** వింజమూరులోని రవి ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞాన ప్రద ర్శనలు ఎంత గానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సుమారు రెండు మూడు రోజులుగా కష్టపడి పర్యావరణ రహిత ప్రయోగాలు సౌరశక్తి ప్రయోగాలు విద్యుత్ ఉపకరణాలు మొదలుగా కలిగిన అంశాలను తీసుకొని తన ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎఫెక్ట్ గురించి పాఠశాల యాజమాన్యం గుండా శ్రీనివాసులు, ఎన్.మహేష్ లు విద్యార్థులకు తెలిపారు. అం తే కాకుండా నేటి విద్యార్థులకు సైన్స్ పరంగా తెలుసుకోవాల్సినటువంటి నూతన అంశాలను తెలుసుకుంటూ వాటిపై మక్కువ పెంచుకోవాలన్నారు. భారతీయ భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ తన విశ్వ ప్రసిద్ధమైన రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. కాంతి పరిక్షేపణం ఆయన చేసిన పరిశోధన భౌతిక శాస్త్రంలో నోబెల్ బహు మతిని తెచ్చిపెట్టిందన్నారు. ఆయన చిన్నతనం నుండి విజ్ఞాన శాస్త్ర విషయాల పట్ల అమితమైన ఆసక్తిని ప్రదర్శించే వారిని మొదటి నుండి తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారన్నారు. తన 12ఏళ్ల వయసులోనే మెట్రిక్యులేషన్‌లో ఫిజిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి యూనివర్సిటీ ప్రథముడుగా నిలిచారన్నారు. ఆయనకు 1954లో భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో సత్కరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన సొసైటీ చైర్మన్



**వింజమూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు గ్రామంలో సొసైటీ చైర్మన్ చల్లా వెంక టేశ్వర్లు యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు యాదవ్‌ల ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లను వారికి ఎలాంటి కష్టం లేకుండా అందుకనే విధంగా సచివా లయ సిబ్బంది ద్వారా అందిస్తుందని తెలిపారు. వీరి మొహంలో చిరునవ్వులు చూడడమే లక్ష్యంగా ప్రభు త్వానికి ఎంత కష్టమైనప్పటికి ముందు రోజు ఆదివారం గనుక వచ్చినట్లయితే ఆ ముందు రోజే పింఛన్లను అందించడం గర్వించదగ్గ విషయంఅన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మననియోజకవర్గ ఎమ్మెల్యే పేద ప్రజల పట్ల అమితమైన అనురాగం అభిమానం కలిగి ఉన్నారని, పేద ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా ఓర్చుకోలేరన్నారు. పింఛన్లను ఒక రోజుముందుగానే అందజేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయ సిబ్బంది, పీవీ శేఖర్, గ్రామస్తులు ఉన్నారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన తహశీల్దార్



**కోట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** మార్చి 1, 8 తేదీల్లో గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేప థ్యంలో శనివారం మండల తహశీల్దార్ కె.జయజయరావు గురుకుల పాఠశా లను పరిశీలించారు. పాఠశాలలో విద్యుత్ వసతి, ఇతర మౌలిక వసతులతో పాటు సిసి కెమెరాలు కూడా ఉన్నాయని చెప్పారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తహశీల్దార్‌కు పాఠశాలలోని వసతుల గురించి తెలియజేశారు.

## స్వర్ణముఖి పొర్లుకట్టలకు కోటి 80 లక్షలు మంజూరు



**కోట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** కోట మండలం పుచ్చలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నది పొర్లు కట్టలకు ప్రభుత్వం కోటి 80 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సిద్ధవరం సొసైటీ చైర్మన్ పాదర్తి కోటేశ్వ రరెడ్డి చెప్పారు. ఆయన కోటలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ నిధులు మంజూరు చేయించినందుకు గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మంజూరు చేయించారని, అభివృద్ధి పనులు చేయి స్తున్నారని పేర్కొన్నారు. గతంలో గూడూరు నియోజకవర్గాన్ని వైసీపీ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో విధ్వంసమైన పాలనను తిరిగి పునర్నిర్మాణం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కోట మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఆకట్టుకున్న చిన్నారుల ప్రాజెక్టులు



**కోట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** కోట మండలంలో శని వారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ న మూనాలు ప్రదర్శించారు. కోట జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక అంశాలకు సం బంధించిన ప్రాజెక్టులను రూపొందించారు. చిన్నారుల ఆలోచనలను అందరూ అభినందించారు. చిన్నప్పుడు వినూత్నంగా చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. సైన్స్ నమూనాలను ఎంఇఓ మస్తానయ్య సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు బాగున్నాయని అభినందించారు.

## మేయర్ దేవరకొండ సుజాతకు మంత్రి నారాయణ ఘన సన్మానం



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు నగరాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పురపాలక శాఖ మం త్రి నారాయణ శరవేగంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే, 48వ డివిజన్‌లో పర్యటిస్తున్న మంత్రిని నూతన మేయర్ దేవరకొండ సుజాత మ ర్యాదపూర్వకంగా కలవగా, ఆమెను శాలువాతో సత్కరించి తన అభినందనలు తెలియజేశారు. ఈ భేటీ సందర్భంగా మంత్రి నారాయణ నగర అభివృద్ధిపై తన స్పష్టమైన కార్యచరణను వివరించారు. ముఖ్యంగా, నెల్లూరులోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ఒక పక్కా ఖిమంత్లీ యాక్షన్ ప్లాన్ ను అమలు చేయ బోతున్నట్లు ప్రకటించారు. ఈ ప్రణాళిక ప్రకారం, నగరంలోని డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, తాగునీటి సం ఫరా మెరుగుదల, రహదారుల విస్తరణ వంటి కీలక మౌలిక వసతుల పనులకు సంబంధించి ప్రతి నెల నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## క్షయ నిర్ధారణ పరీక్షలు చేపట్టి వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** జిల్లాలో క్షయ అనుమానితులను గుర్తించి ఖచ్చిత మై న పరీక్షలు నిర్వహించి, వ్యాధి నివారణకు వైద్యు లు సహకరించాలని జిల్లా ఎయిడ్స్ టీబీ అధికారి ఎస్కె.ఖాదర్‌వలీ పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరు దర్గామిట్ట లో ఉన్న కిమ్స్ వైద్యశాలలో సిబ్బంది మరియు వివిధ విభాగాల హెచ్వోడీలతో క్షయ వ్యాధిపై రీ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని డాక్టర్ ఖాదర్ వలీ నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ , క్షయ వ్యాధి లక్షణాలను గుర్తించిన వైద్యులు వారిని జిజిహెచ్ టీబీ వైద్యశాలకు రెఫర్ చేయాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వారికి ప్రభుత్వం ఆరు నెలల పాటు ఉచితంగా మందులను అందిస్తుందని వివరించారు . క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు . అంతేకాకుండా నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న టిబి ముక్త పంచాయితీ కార్యక్రమాన్ని కూడా క్లుప్తంగా వివరించారు . కిమ్స్ హాస్పిటల్ వివిధ విభాగాల హెచ్వోడీలు , నెల్లూరు జిల్లా టిబి నివారణ సిబ్బంది పాల్గొన్నారు

## టైలరింగ్ కేవలం వృత్తి కాదు.. అదొక అద్భుతమైన కళ



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు నగరంలోని జిపిఆర్ గ్రాండ్లో నిర్వహించిన "టైలర్స్ డే" వేడుకలకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారాయణకు టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు,సభ్యులు ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ, టైలరింగ్ అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, అది ప్రతి శుభ:కార్యం లోనూ భాగమయ్యే ఒక అద్భుతమైన కళ అని కొనియాడారు.నెల్లూరులోనే సుమారు 9 వేల మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది బలమైన మార్గమని పేర్కొన్నారు. ఆధునిక కాలానికి అనుగుణంగా ఈ రంగం ఫ్యాషన్ డిజైనింగ్,ఆన్‌లైన్ మార్కెటింగ్ వైపు అడుగులు వేయా లని, కొత్త యంత్రాలు మరియు మార్కెట్ లింకేజీల కోసం ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇస్తూనే, మధురైకి చెందిన సెల్వకుమార్ దంపతుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పేద టైలర్లకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన అసోసియేషన్ సభ్యులను అభినందించగా, కార్యక్రమం ముగిసిన తర్వాత మంత్రి నారాయణతో ఫొటోలు మరియు సెల్ఫీలు దిగేందుకు టైలర్ సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పోటీపడటంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సు జాత,డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్ ,మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి , బాబు, షేక్ గులాం ఖాదర్ కార్యవర్గ సభ్యులు మహిళా టైలర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధం



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఓ వి. సు జాత హెచ్చరించారు . శనివారం డిఎం అండ్ హెచ్ ఓ వి. సుజాత తన చాంబర్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా " గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం PNDT act జిల్లాస్థాయి సలహా సంఘం సమావేశము నిర్వహించారు . జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై సమీక్షించారు . ఆమె మాట్లాడుతూ , గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమన్నారు . స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు వైద్యుల రెఫరల్ స్లిప్పు కలిగి ఉంటేనే స్కానింగ్ పరీక్షలకు అనుమతి ఉం టుందన్నారు . ముఖ్యంగా ఆర్ఎంపీలు స్కానింగ్ పరీక్షలకు రిఫరల్ చేయ వద్దని ఆదేశించారు . పరీక్షలు నిర్వహించిన ప్రతి గర్భిణీ స్త్రీ వివరాలను సంబంధిత ఆన్లైన్ పోర్టల్లో ఫామ్ ఎఫ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు . ఇతర స్పెషాలిటీ వైద్యులు సంబంధిత ఆన్లైన్ పోర్టల్‌లో " నిల్ " రిపోర్టు తప్ప నిసరిగా నమోదు చేయాలని వారు ఇతర స్కాన్లు చేసిన వివరాలు వేరుగా మరియొక రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు . పీసీ అండ్ పి అండ్‌డి టియాక్ట్ కింద గర్భిణీ స్త్రీ వివరాలను నమోదు చేసిన రిజిస్టర్ ఫామ్ ఎఫ్ లు అధికారుల తనిఖీ కొరకు రెండు సంవత్సరాలు భద్రపరచాలని తెలిపారు . జిల్లా లోని స్కానింగ్ కేంద్రాలపై 50 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు డిఎంహెచ్వో తెలిపారు . అనంతరం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘం చైర్పర్సన్ డాక్టర్ సిహెచ్. కిరణ్ మాట్లాడుతూ , జిల్లాలో భ్రూణ హత్యలు పూర్తిగా అరికట్టే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మరియు ఆడపిల్లల పుట్టుక ఆవశ్యకతపై విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలతారెడ్డి , డాక్టర్ రామకృష్ణ , డాక్టర్ ఉమామహేశ్వరి , డెమో కె. కనకరత్నం , ఎన్జీవో ఎస్. కవితా రెడ్డి , శ్రీనివాసరావు , కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు .

## భర్త మరణం వెంటనే స్పందన

### ఎన్టీఆర్ భరోసా స్పౌస్ పెన్షన్ అందజేసిన డాక్టర్ గణేష్ కుమార్



**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త -వైద్యం** 47వ డివిజన్ కామాటీ వీధిలో భర్త మృతి చెందిన వెంటనే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అల్లూరి సుజాత బాయ్ కుటుంబానికి ఎన్టీఆర్ భరోసా స్పౌస్ పెన్షన్ మంజూరైంది. రాష్ట్ర పొం గూరు నారాయణ నాయకత్వంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. టిడిపి డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ తక్షణ స్పందనతో అర్హత కలిగిన లబ్ధిదారికి మరుసటి నెల నుంచే రూ.4,000 పెన్షన్ అందే లా అధికారులతో సమన్వయం చేశారు. బూత్ ఇంచార్జ్ కంచి రాధాకృష్ణ , సచివాలయం సిబ్బంది శేషమ్మ.. సహకారంతో అవసరమైన పత్రాలు వేగంగా సేకరించి దరఖాస్తు ప్రాసెస్ చేయడంతో ఆలస్యం లేకుండా పెన్షన మంజూరైంది పొలిటికల్ టీం టిఎన్టియుసి నగర ఉపాధ్యక్షులుఊ సురేంద్ర సింగ్ , బూత్ ఇంచార్జ్ సచివాలయ సిబ్బందితో కలిసి అంద జేసారు పెన్షన్ అందుకున్న సందర్భంగా కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ధర్మవరం సుబ్బారావు, డాక్టర్ గణేష్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందనాత్మక పాలనకు ఇది నిదర్శనంగా మంచి ప్రభుత్వం అని అభిప్రాయపడ్డారు

## పెన్షన్ల పంపిణీలు దేశంలోనే అగ్రగామిక ఆంధ్రప్రదేశ్ : ఎమ్మెల్యే



**వెంకటాచలం ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** పెన్షన్ల పంపిణీయంలోనే దేశంలోనే అగ్రగంగా ఆంధ్రప్రదేశ్ నిసింది అన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలంలోని వడ్డీ పాలెం లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొన్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ ఏపీలో నెలకు 2725 కోట్లు, చేస్తుంటే ఏడు పెద్ద రాష్ట్రాల్లో కలిపి 2754 కోట్లు మాత్రమేనన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఐదేళ్లలో ఖర్చు చేస్తున్న మొత్తము 33 వేల కోట్లు, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అన్ని పథకాలు కలిపి ఖర్చు చేసిన మొత్తం 33 వేల కోట్లు దాటి లేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి నేతలు నోరు పారేసుకోవటం దారుణం అన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికివందనం అందజేశామన్నారు. గతవైసిపి హయాంలో ఇరిగేషన్లు అడ్డంగా దోచు కోవటం బిల్లులు చూసుకున్నారు అన్నారు. రైతులకు పూర్వ వైభవం వచ్చింది రైతుసంక్షేమం కోసం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఏం సి చైర్మన్ రాధాకృష్ణ నాయుడు మండల కన్వీనర్ రాధారెడ్డి మునుస్వామి మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెట్టుపై నుండి పడి కల్లు గీత కార్మికుడికి గాయాలు



**సంగం ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** వెంగారెడ్డిపాళెం వద్దకల్లు గీస్తు ప్రమాదవశాత్తు చెట్టు మీద నుండి పడి పడమటిపాలెంకి చెందిన ఎన్ కుమార్ అనే గీత కార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు.

## అట్టహాసంగా కలెక్టరేట్ ఏవో తుమ్మా ఉద్యోగ విరమణ



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** కలెక్టరేట్ పరిపాలనాధికారి తుమ్మా విజయ్‌కుమార్, శని వారం ఉద్యోగ విరమణ,కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ శాఖలో విజయకుమార్ జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు 44 సంవత్సరాలపాటు సుదీర్ఘ పనిచేసిన విజయ్ కుమార్ కలెక్టరేట్ పరిపాలనాధికారి హోదాలోశనివారం ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్ఓ ఎన్.విజయ్ కుమార్ పాల్గొన్నారు.అనంతరం డిఆర్ఓ మాట్లాడుతూ ఏవోగా విజయ్ కుమార్ తనవంతు సేవలు అందించారని కొనియాడారు కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు ఏవో విజయకుమార్‌తో ఉన్న అనుబంధాన్ని వాళ్ల పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి నారాయణ కలిసిన ఏపీ ఎన్జీవో సంఘ నేతలు



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బందారుపల్లి వెంకటేశ్వర్లు కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణని నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్జీవో సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కిర ణ్ కుమార్,అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం ఆంజనేయ వర్మ, ఆర్గనైజ్ సెక్రె టరీ లక్కాకుల పెంచలయ్య, ఉపాధ్యక్షులు ఈదురు కరుణమ్మ, జాయింట్ సెక్రెటరీ పి రవికుమార్, ఎన్ రాజేంద్ర, సిటీ సెక్రెటరీ ఏవి కృష్ణకుమార్, జాయింట్ సెక్రెటరీ శంషుద్దీన్, మహిళా వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. స్వర్ణలత మహిళా చైర్ పర్సన్ ఎల్ నవోదయ కన్వీనర్ జి లక్ష్మి, అంజనాదేవి, సుమన్, లత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## రూ.5,456.26 కోట్లతో టీటీడీ 2026-27 బడ్జెట్ ఆమోదం



**కోవూరు ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** టీటీడీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.5,456.26 కోట్ల బడ్జె ట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో ఎం.రవిచంద్రతో కలసి శనివారం ఆయన మీడియా సమావేశంలో మాటాడారు. తిరుమలలో జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. భక్తుల సౌకర్యాల అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల విస్తరణ కోసం రూ. 5,456 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం లభించింది. దర్శన క్యూలైన్లలో సౌకర్యాలు, భద్రతను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. అలాగే తిరుపతిలో"గోవింద అక్షరమాల" కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సమావేశం అనంతరం ఉగాది డైరీ, ఒంటిమిట్ట బ్రహ్మోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టీటీడీ బోర్డు సబ్ కమిటీ సిఫార్సుల మేరకు టీటీడీ చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు గాను రూ.118.89 కోట్లు కేటాయించారు. భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవారికి ముడుపులు అందించే దాతల సౌకర్యార్థం"శ్రీవారి ముడుపు పత్రం పథకం" ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇంకా పలు నిర్ణయాలు తీసుకున్నారు. టిటిడి బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, సివిఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మానవ సంక్షేమం కోసం సైన్సు పరిశోధనలు విద్యార్థులు చేపట్టాలి





**కోవూరు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ పాఠశాల సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సైన్స్ ప్రదర్శనను పచ్చిపాల రామనాథమ్మ అకాడమి ఫౌండేషన్ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శివుని నరసింహు లు రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి సైన్సు ప్రదర్శన వలన విద్యార్థుల్లో దాగివున్ననైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. సైన్సు మానవాళికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సైన్సు ప్రదర్శనలో విద్యార్థులు చేపటన అనేకఅంశాలు జిల్లాస్థాయికి ఎంపికచేసేలా ఉన్నాయన్నారు. మానవుని జీవితంలో సైన్సుపూర్తిగా మిళితమై ఉందన్నారు. విద్యార్థులు మానవ సంక్షేమం కోసం సైన్సు పరిశోదన చేపట్టేలా ప్రేరేపించడమే ఈ సైన్సు దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థుల్లో సైన్సు పట్ల ఆసక్తి, కొత్త విషయాలు నేర్చుకోవాల్న తపన ప్రయోగాలుచేసే చొరవ ఉండాలని వాటిని ప్రోత్సహించడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. విద్యార్థులను సృజనాత్మక పంథాలోకి సైన్సదినోత్సవ సంబరాలు ఎంత గానో తోడ్పడుతాయన్నారు. పాఠశాల విద్యార్థులు చేపట్టినప్రాజెక్టులు అందర్నీ ఆకట్టుకొంది. వైకేఆర్అండ్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన, పాఠశాల ప్రధానో పాధ్యాయులు సోఫియా కిరణ్మయి తదితరులు ఉన్నారు. అంతకముందు సి.వి. రామన్ చిత్రపటానికి ప్రధా నోపాధ్యాయురాలు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు.సైన్స్ ఉపా ధ్యాయులు కె. భారతి, వి. సుచరిత, ఈ. రాజేశ్వరి, ఎన్. సుజన, కె. సుబ్బమ్మ, ఎన్. శైలజ, కె. శివజ్యోతి, పి. చంద్ర మౌళి, తదితరులు ఉన్నారు.

## లుంబిని విద్యాలయంలో ఘనంగా నేషనల్ సైన్స్‌డే వేడుకలు



**చేజర్ల ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** చేజర్ల మండలంలోని లుంబిని విద్యాలయంలో నేషనల్ సైన్స్‌డే సందర్భంగాశనివారం నిర్వహిం చిన సైన్స్ఎక్స్‌పో 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చా రు.విజ్ఞానంతో నిండిన ఈ కార్యక్రమం విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా నిలిచింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధు లుగా మండల విద్యాశాఖాధికారులు ఇందిర, మస్తానయ్య , మండల అభివృద్ధి అధికారి అమర్ తహసిల్దారు మస్తానయ్య, ఎస్ఐ తిరుమలరావు ముఖ్య అతిధులుగా హాజరై సైన్స్ ఎక్స్పోను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కొనసాగించారు. ముందుగా సివిరా మన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇక్కడకు విచ్చేసిన అతిధులు మాట్లాడుతు విద్యార్ధులలో విజ్ఞాన శక్తి పెపొందించేందుకే ఈ ఇలాంటి ఎక్స్‌పోలు బాగా ఉపయోగపడు తాయని తెలియజేశారు.భవిష్యత్తులో శాస్త్ర,సాంకేతిక రంగాలలో ముందంజ వేయాలని విద్యార్ధులను ప్రోత్సహించారు. అన్ని రంగాలలో సైన్స్ అవసరమని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలతోపాటు రక్షణ రంగం,రవాణా వైద్యం, ఇలా అన్ని రంగాలలో సైన్స్‌దే అగ్రస్దానం అని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్ది సైన్స్‌పై అవగాహన పెంచుకొని సివి రామన్‌ను ఆదర్శంగా తీసుకొని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచిం చారు. ఈ సైన్స్ ఎక్స్‌పోను పస్టుక్లాసు నుండి 9 వ తరగతి వరకు విద్యార్దులు పాల్గోనడం జరిగింది.ఈ ప్రదర్శనలో పాల్గోన్న విద్యార్దులు 144 సైన్స్ ప్రాజక్టులు ప్రదర్శంచారు. అందులో విద్యార్దులు తయారు చేసిన రివర్ క్లీనింగ్, రోబో, థర్మల్ పవర్ ,సోలార్‌ప్లాంట్, స్మార్ట్ సిటీ, అగ్రికల్చర్ ప్రోడక్ట్స్,సెన్సార్ ప్రాజ క్ట,వాటర్ ట్రాన్స్‌పోర్టు, వివిధ రకాల కాన్సెప్టులు న ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతి సైన్స్ ప్రాజక్టు సృజనాత్మకత వినూత్న ఆలోచనలు విద్యార్దులలో స్పష్టంగా కనిపించాయి. విద్యార్దులు చేసిన ప్రాజక్టులు మీద ముఖ్య అతిధులు పలు ప్రశ్నలు విద్యార్దులను అడగగా విద్యార్దులు చెప్పినటువంటి సమాదానాలు పలువుర్ని ప్రత్యేకంగా ఆకర్షించాయి. ఈ ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన కనబరచినటువంటి విద్యార్దులకు ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులు పాఠశాల యాజమాన్యం అందచేయడం జరిగింది. లుంబిని పాఠశాల కరస్పాండెంట్ బి రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రమేష్, ఉపాద్యాయని, విద్యార్దులు పాల్గోన్నారు.

## శ్రీ వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ లోసైన్స్‌డే



**బుచ్చి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి నేతృత్వంలోసైన్స్‌పేర్ పెద్దఎత్తున నిర్వహించారు. విద్యార్దులు పెద్ద ఎత్తున ప్రాజక్టులు తయారు చేయగా వాటన్నింటిని ఉపాధ్యాయులు క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సుమారు 3 వందల మంది విద్యార్దులు పాల్గోన్నారు. విద్యార్దుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఈ ప్రయోగాలను పరిశీలించి విద్యార్దులను అభినందించారు.గతంలో కూడా తమ పాఠశాల నుండి అనేక అవార్డులు సాధించినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్దులు పాల్గోన్నారు.

## పాతూరు చెరువు సుందరీకరణ పనులు



**వింజమూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** వింజమూరు పాతూరు చెరువు కట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సుందరీకరణ పనులకు వీబీజీరామ్‌జీ పథకం ద్వారా 50 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని జిల్లా డ్వామా పీడీ గంగా భవాని పేర్కొన్నారు. శనివారం వింజమూరు పాతూరు చెరువు కట్టను స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీ రాజ్ ఏఈ తిరుమలయ్య ఏపీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది పరిశీలించారు. చెరువు సుందరీకరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. సుమారు 300 మీటర్ల పొడవునా విస్తరించి ఉన్న చెరువు కట్ట దిగు ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నామన్నారు. ఈ ప్రాంతంలో పచ్చని చెట్లతో కూడిన అంధమైన పార్కు ఏర్పాటు చేసి ప్రజలకు ఉదయం సాయంత్రం వేళల్లో నడవడానికి అనువుగా వాకింగ్ ట్రాక్ కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు ఒక మంచి వినోద కేంద్రం అందుబాటులోకి వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషితో ఎళ్ల తరబడి నిరాధారణకు గురైన చెరువు కట్ట ఇప్పుడు కొత్త రూపు సంతరించుకోబోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంగం ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించిన జెడ్పి సిఇఒ



**సంగం ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** సంగం ఎంపిడిఒ కార్యాలయాన్ని జెడ్పి సిఇఒ శ్రీదర్‌రెడ్డి పరిశీలించారు. కుటుంబ సర్వే రికార్డులు పరిశీలించారు. సంగం,సిద్దీపురం గ్రామాలకు చెత్త సేకరించే తోపుడు బండ్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సంగం మండలంలో 85 శాతానికి పైగా కుటుంబ సర్వే ముగిసిందని ఆయన తెలిపారు. మిగిలిన 15 శాతం సర్వేను వారం రోజులలో పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.రాబోయే గ్రామ పంచాయితీ ఎన్నికలకు కుటుంబసర్వే గణాంకాలే కీలకం అని చెప్పారు. పెన్షన్ల పంపిణి సమయం లోనే సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. త్వరలోనేమండలాలకు ట్రై సైకిళ్ళు ఈ ఆటోల సరఫరా చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి కంటాబత్తిన పద్మావతమ్మ, ఎంపిడిఒ షాలెట్, సిద్దీపురం సర్పంచ్ బండ్ల ప్రసున, టిడిపి మండలాధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు బాబు తదితరులు పాల్గొన్నారు.

## రెయిన్‌బో ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సైన్స్‌డే







**బుచ్చి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం రెయిన్‌బో ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సైన్స్‌డే ఘ నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల కరస్పాం డెంట్ టి.చిట్టిబాబు నేతృత్వంలో నిర్వహించారు.ఈకా ర్యక్రమాన్ని సిద్దార్దా కాలేజి ప్రిన్సిఫల్ ఫి,బాలకృష్ణా కుమారస్వామిరెడ్డి ప్రారంభించారు. విద్యార్దులు రకం కాల ప్రయోగాలు నిర్వహించారు. ప్రయోగాలను తిలకిం చిన అతిధులు విద్యార్దుల సృజనాత్మకతను మెచ్చుకున్నారు. ప్రిన్సిఫల్ ఇలియాజర్ మాట్లాడుతు సైన్స్ ఎగ్జిబిషన్ వల్ల విద్యార్దులలో సృజనాత్మకతను వెలికి తీయవచ్చునని అన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రయోగాలు పరిశీలించిన వారు కొన్ని ప్రయోగాలను ఎంపిక చేసి విద్యార్దులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సుమారు 160 ప్రయోగాలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గోన్నారు.

## శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో అట్టహాసంగా ముగిసిన స్పోర్ట్స్ మీట్





**బుచ్చి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సి పాల్టీలో ని శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో అట్టహసంగా స్పోర్ట్స్ మీట్ సభను నిర్వహించారు.కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎస్ఐ సంతోష్‌రెడ్డి వ్యవహరించారు.ఈ సందర్బంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా అవసరమని అన్నారు. శ్రీ వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ మేనే జమెంట్ 5 రోజులు పాటు క్రీడలు నిర్వహించడం అంటే అభినందనీయమని అన్నారు. చదువుకు ఎంతటి ప్రాధాన్యత నిస్తారో క్రీడలకు కూడా అంతటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. చిన్నపిల్లలు బైకులు తోలితే కేసులు బుక్ చేస్తారని ఆయన హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు బైకులు ఇవ్వద్దని అన్నారు. సుమారు 20 క్రీడలలో 450 మంది విద్యార్దులు పాల్గోనగా విజేతలైన విద్యార్దులందరికి ఎస్ఐ చేతులు మీదుగా బహుమతి ప్రధానం చేశారు డైరెక్టర్ సురేష్‌రెడ్డి, హన్వితారెడ్డి, హైస్కూల్ ప్రిన్సిపల్ సంజయ్ ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గోన్నారు.

## సైన్స్ సమాజానాకి ఎంతో కీలకం



**బుచ్చి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సి పాల్టీలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమం కోలహ లంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా దుర్గా ప్రసాద్ ( ఔత్సాహిక ఖగోళ శాస్త్రవేత్త ) పాల్గోన్నారు. విద్యార్దులు చేసిన ప్రయోగాలను ఆయన పరిశీలించారు. సైన్స్ శాశ్వతమైనదని టెక్నాలజి మారుతుందని విద్యార్దులు సైన్స్ మూలాలను తెలుసుకొని సమాజానికి సైన్స్ ఏవిధంగా ఉపయోగపడుతుందో కనిపెట్టాలని అన్నారు. ఈ సందర్బంగా విద్యార్దులు ప్రకృతిలోని పండ్లు,పూలు, ఆకులు చెట్లు వాటి గురించి విద్యార్దులు వాటి శాస్త్రీయ నామాలను తెలుసుకోని ప్రదర్శనగా ఉంచారు. ప్రకృతి మనకు ఆధారమని ప్రకృతిని కాపాడడమే సైన్స్ యొక్క లక్షణం అని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ ముందుగా సీవిరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో విద్యార్దులు, విద్యార్దుల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## టిడిపి కార్యకర్తలు వైసీపీలో చేరిక





**కోట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వాటంబేటి ఆనంద్, ఉపేంద్ర తదితరులు వైసీపీలో చేరిపోయారు. శనివారం వీరంతా నెల్లూరులోని వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. వారందరినీ శ్యాంప్రసాద్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఇక నుంచి తామంతా శ్యాంప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో తీరప్రాంత గ్రామాల్లో వైసీపీ కోసం కష్టపడి పనిచేస్తామని చెప్పారు. తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే వరకు పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు ఉప్పల ప్రసాద్ గౌడ్, ఉప్పల ప్రభాకర్, విన్నమాల వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.కొత్తపట్నం టిడిపికి షాక్ కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగి లింది. ఆ పార్టీలోని కీలకమైన నాయకులు వైసీపీలో చేరడంతో ఆ పార్టీకి పెద్ద దెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతమూడు దశాబ్దాలుగా తీరప్రాంతంలో పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి పట్టు సాధిస్తూ వస్తున్నారు. పలు టిడిపి కుటుంబాల నుంచి కార్యకర్తలు వైసీపీలో చేరడం షాక్ తగిలిందనిచెప్పవచ్చు. స్థానికసంస్థల ఎన్నికల్లోపు మరిన్నిరాజకీయ సమీకరణలు మారనున్నట్లు తెలుస్తోంది.

## చెన్నూరులో పెన్షన్‌లు పంపిణీ



**గూడూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలో తిరుపతి పార్లమెంట్ టీడీపీ మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్‌లు పంపిణీ చేశారు.మట్టం శ్రావణి రెడ్డి మా ట్లాడుతూ పెన్షన్‌ను పెంచిన ఘనత చంద్రబాబుకే చెందుతుందన్నారు. ఒక్క రోజు ముందుగానే పెన్షన్‌లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. టీడీపీ హయంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు.నీటి సంఘం అధ్యక్షుడు యరమాపు హేమంత్ రెడ్డి, మాజీ చేనేత సొసైటీ అధ్యక్షుడు కటికాల శ్రీనివాసులు, మండల కన్వీనర్ అల్లం క్రిష్ణయ్య, ఏఎంసి డైరెక్టర్ మల్లి శ్యామల, మేకల భాస్కర్, మాధవి, శ్రీనివాసులు, విజయ భాస్కర్, శేఖర్, సిద్దని గణేష్, వేడిచెర్ల వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో వేలం పాటలు



**చిల్లకూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** మండల పరిధిలోని తూర్పు గ్రామంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో మార్చి 10వ తేదీ నుండి జరుగు ముత్యాలమ్మ అమ్మవారి జాతర సంబంధించి వేలం పాటలు శనివారం నిర్వహించారు. జాతరలో తలనీలలో సేకరించే హక్కు 8 లక్షల 52 వేలు, అమ్మవారి ఫోటోలు డాలర్లు తాయతులు అమ్ముకునే హక్కు రెండు లక్షలకి పాడుకోవడం జరిగింది. అదేవిధంగా జాతర తదుపరి సంవత్సరం కాలం పాటు టెంకాయలు పూజా ద్రవ్యాలు విక్రయించుకునే హక్కు 18 లక్షల 90 వేలు, అమ్మవారి ఫోటోలు డాలర్లు తాయత్తులు అమ్ముకునే హక్కు 3 లక్షల 90 వేలు, వెయ్య కళ్ళకుండాలు అమ్ముకునే హక్కు 3 లక్షల 50 వేలు, అమ్మవారికి భక్తులు సమర్పించు దున్నపోతులు వగైరాలు స్వాధీన పరుచుకునే హక్కు ఐదు లక్షల పది వేలు, నివేదితర కొబ్బరి చెక్కలు సేకరించే హక్కు నాలుగు లక్షల 2 వేలు, క్లాత్ పందిళ్లు, ఐరర్స్ సప్లై చేసి నిర్వహించుకునే హక్కు 3 లక్షల60 వేలు దేవస్థానం ప్రాంగణంలో పుష్పాలు, పూలు మాలలు అమ్ముకునే హక్కు ఒక లక్ష 82 వేలు, గుడి పై భక్తుల మొక్కులు రూపంలో వేసే కోడి పిల్లలు ఎర్రగడ్డలు దాన్ని వగైరా సేకరించి హక్కు 36000 పాడుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ సుధీర్ బాబు, ఈఓ నవీన్ కుమార్, ఆలయ చైర్మన్ చిల్లకూరు దశరథ రామిరెడ్డి, కమిటీ సభ్యులు అన్నం మునిశేఖర్, నాయకులు ఓబ్బాయి శివకుమార్, మేకల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రేస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా సైన్స్ ఎక్స్పో కార్యక్రమం



**చిల్లకూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** మండలంలోని చింతవరంలో ఏర్పాటై ఉన్న రేస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2026 సైన్స్ ఎక్స్పో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన రిటైర్డ్ హెడ్మాస్టర్ పి.సంపత్ రెడ్డి, జిందాల్ పవర్ లిమిటెడ్ ప్లాంట్ హెడ్ సుల్తాన్ అహ్మద్ మన్సూరి, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శివసుబ్రహ్మణ్యంలు పరిశీలించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎల్లసిరి బాల చెన్నయ్య మాట్లాడుతూ రేస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను సైన్స్ ఎక్స్పో వంటి కార్యక్రమాలు వెలికితీస్తాయని, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలను మా పాఠశాలలో మరెన్నో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. సైన్స్ ఎక్స్పోలో ప్రతి పక్కనపరచిన విద్యార్థులకు వారి చేతులమీదుగా బహుమతులను అందజేసి, అతిథులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.పాఠశాల అధ్యక్షులు గుమ్మడి వెంకటసుబ్బయ్య, జాయింట్ సెక్రెటరీ జి. యమున, హెచ్ఎం డి.లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ వీరాభిమాని అఖిల్ మృతి బాధాకరం : మాజీ మంత్రి కాకాణి



**మనుబోలు ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామదళితవాడకు చెందిన జగన్ వీరాభిమాని పైనం అఖిల్‌రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో శనివారం మాజీ మంత్రి ,జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకుటుంబాన్ని పరామర్శించాడు. తల్లిరేవతని ఓదార్చి తాము అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతు అఖిల్‌కు జగన్ అంటే ప్రాణం అని ఎన్నికలలో వైసిపి గెలవాలని ఎంతో కష్టపడ్డారని అన్నారు. అలాంటి యువకుడు మన మధ్య లో లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబానికి దేవుడు మనోధైర్యం కల్పించాలని అన్నారు. ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందెల వేణుగోపాల్,వైసిపి నాయకులు చెందులూరు శ్రీనివాసులు, గుర్రం ప్రభాకర్, మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి బాస్కర్‌గౌడ్, ఆవుల తులసీరామ్‌యాదవ్, ఎంపిపి వజ్రమ్మ,ముంగర రవీంద్రరెడ్డి, ఆవుల వెంకట రమణయ్య, యూత్ నాయకులు బొమ్మిరెడ్డి పార్దీశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## వైద్య రంగంలో మెడికల్ మాఫియా, డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి : పముజుల దశరథరామయ్య



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త** వైద్య రంగంలో చెలరేగుతున్న మాఫియాని అరికట్టే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ సీనియర్ నాయకులు పముజుల దశరథ రామయ్య డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట రూరల్ మండల పార్టీ శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ రామయ్య మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య రంగాలలో విపరీతమైన దోపిడి జరుగుతుందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులు దనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయని, వైద్య పరీక్షలు, అధికమందుల ధరలు, అనవసర శస్త్ర చికిత్సల ద్వారా ప్రజలను దోచుకుంటున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయకుండా ప్రైవేటు వైద్య రంగానికి ప్రోత్సాహం కల్పించడంతో పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య సేవలు పేరిట ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ మాఫియా, డ్రగ్స్ మాఫియా ను అరికట్టే వరకు తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. పలువురు సీపీఐ రూరల్ మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.

## గ్రామాల పరిశుభ్రత ప్రధాన లక్ష్యం

### స్వచ్ఛ రథాలు పంపిణీ చేసిన సోమిరెడ్డి



**వెంకటాచలం ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** గ్రామాలు పరిశుభ్రత ప్రధాన ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచించారు. గ్రామాల్లో కుంచిన చెత్తను తీసుకెళ్లేందుకు చచ్చారదాలను సోమిరెడ్డి గ్రామాల వారీగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతా పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండాలని కోటమ లక్ష్యం పనిచేస్తుందని వెల్లడించారు. పెద్ద పంచాయతీలకు రెండు చిన్న పంచాయతీ ఒకటి వంతున రథాలను అందజేస్తామన్నారు. ఇటీవల వెంకటాచలం మండలంలో ట్రాక్టర్లను పంపిణీ చేశామన్నారు. పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా అల్లిపురంలో ఉన్న చెత్త యార్డును మంత్రి నారాయణ ఛాలెంజ్ తీసుకొని ఖాళీ చేయడం జరిగిందన్నారు. ఆరోగ్య పరిస్థితులు ఏర్పడకుండా ప్రతి గ్రామానికి స్వచ్ఛరదాలు పంపిణీ చేస్తున్నమన్నారు. పచ్చదనాన్ని మెరుగుపరిచే చర్యలు భాగంగా వెంకటాచలంలో 27వేల మొక్కలు నాటడం జరిగిందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అన్ని పంచాయతీల్లో మొక్కలు నాటి గ్రామాలను పచ్చదనంగా తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రమైన రాధారెడ్డి ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణ నాయుడు వడ్డెర సంఘం డైరెక్టర్ మునిస్వామి, ఎంపీడీవో కల్పన, మండలంలోని నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలో నుంచి టీడీపీలోకి చేరికలు



**వెంకటాచలం ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** టీడీపీలో చేరిన వారిలో వెంకటాచలం ఉప సర్పంచ్ యామాల అమర, వార్డు సభ్యుడు ఉప్పు సురేష్ తో పాటు 20 కుటుంబాలు వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెంలో జరిగిన కార్యక్రమంలో వారికి కండువాలు కప్పి ఆత్మీయ ఆహ్వానం పలికిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి యనమల రాజేంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారిలో తురకా బాలరాజు, ప్రసాద్, ఉప్పు నరసింహ, బుబ్బయ్య, నరసింహ, వలిపి మునిబాబు, చల్లా చెంచుబాబు, తురకా హరిబాబు, వలిపి అంకయ్య, తురకా దేవగిరి, గోపాలయ్య, యామాల మస్తాన్ తదితరులు.

## తాగునీటిలో మురుగు నీరు





**అల్లూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** తాగునీటిలో మురికినీరు వస్తుంటే అల్లూరు నగర పంచాయితీ కమిషనర్, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అల్లూరు మద్యకాపు వీధిలోని రిటైర్డు ఎస్ఐ పి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. గత పది రోజుల నుంచి తాగేందుకు ఇంటి అవసరాలకు కుళాయిలు ద్వారా వచ్చే మంచినీటిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తుంటే బురదలతో కూడిన నీరు వస్తుందని పంచాయితీ సిబ్బందికి ఎన్నిసార్లు తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. ఇదే విధంగా వస్తే సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌లో బురదతో కూడిన నీటిని సరఫరా అవుతోందని నగర పంచాయతీ అధికారులపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు.